

పల్లెల్లో సూక్ష్మ పోషకాల దందా

గ్రామీణ ప్రాంతాల్లో సూక్ష్మ పోషకాలనే పొటాష్, డీఏపీ ఎరువులుగా విక్రయిస్తున్నారు. వ్యవసాయ అధికారుల దృష్టికి వెళ్లినా కనీస చర్యలు లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. ..IIలో▸



అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల ఆలయ నిత్య కళా వేదికపై హైదరాబాద్‌కు చెందిన నందీశ్వర, పద్మావతి ఆర్ట్స్ అకాడమీల వారి సంప్రదాయ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	: 1,633
ప్రస్తుతం	: 1,632
సామర్థ్యం (టీఎంసీలు)	: 105.788
ప్రస్తుతం	: 101.773
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 11,954
అవుట్ ఫ్లో	: 11,654

న్యూస్‌రీల్

రూ.45 లక్షలతో బీసీ హాస్టళ్లలో అత్యవసర మరమ్మతులు

కర్నూలు (అర్బన్): జిల్లాలోని ప్రభుత్వ వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహాల్లో అత్యవసర మరమ్మతులు చేపట్టేందుకు ప్రతిపాదనలు పంపుతున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ, సాధికారత అధికారిణి పీ వెంకటలక్ష్మమ్మ తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. తమ శాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు సొంత భవనాలు కలిగిన వసతి గృహాల్లో ఈ పనులు చేపట్టనున్నామన్నారు. ఇందుకు సంబంధించి ఒక్కో వసతి గృహానికి రూ.1.50 లక్షల ప్రకారం మొత్తం 30 సొంత భవనాలకు రూ.45 లక్షలు వెచ్చించనున్నట్లు చెప్పారు. డైరెక్టర్ ఆదేశాల మేరకు ఏఏ వసతి గృహంలో ఏ రకమైన పనులు చేపట్టాలనే అంశంపై ప్రతిపాదనలు రూపొందించి పంపుతున్నామన్నారు.

14 నుంచి పంచాయతీ వారోత్సవాలు

కర్నూలు కల్చరల్: ఈనెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు పల్లె పండుగ - పంచాయతీ వారోత్సవాలు చేట్టాలని డిప్యూటీ సీఎం మంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. జిల్లా నుంచి జిల్లా కలెక్టర్ పి. రంజిత్‌బాషా, డీఆర్‌ఓ చిరంజీవి, జిల్లా పరిషత్ సీఈఓ నాసరరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ నాగేశ్వరరావు, డీపీఓ భాస్కర్ పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పల్లె పండుగ వారోత్సవాలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో రూ.150 కోట్ల తో సిమెంట్ రోడ్లు, గోకులం తదితర పనులకు శంకుస్థాపనలు చేపట్టనున్నామన్నారు. సమీక్షలో డ్వామా ఇన్‌చార్జ్ పీడీ మాధవీలత, పంచాయతీ రాజ్ ఎస్‌ఈ రామచంద్రారెడ్డి, ఈఈ మద్దన్న, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి మార్కెట్‌యార్డుకు సెలవు

ఆదోని అర్బన్: దసరా పండుగ సందర్భంగా ఆదోని వ్యవసాయ మార్కెట్‌యార్డుకు గురువారం, శుక్రవారం, శనివారం వరకు సెలవు దినాలు ఉంటాయని యార్డు సెక్రటరీ రామ్మోహన్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఈ మూడు రోజులపాటు యార్డులో క్రయ, విక్రయాలు జరగవని, రైతులు గమనించాలన్నారు. దిగుబడులను యార్డుకు తీసుకురావొద్దని తెలియజేశారు. ఆదివారం సెలవు కావడంతో సోమవారం నుంచి యార్డులో క్రయ, విక్రయాలు కొనసాగుతాయన్నారు.

16న మరళిలో ఇసుక ఓపెన్ రీచ్‌ను ప్రారంభించాలి

కర్నూలు కల్చరల్: కౌతాళం మండలం మరళిలో ఇసుక ఓపెన్ రీచ్‌ను ఈనెల 16వ తేదీన ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 10వ తేదీకి టెండర్ టైం ముగుస్తుందన్నారు. ప్రజలకు ఇసుక సులభంగా అందించేందుకు వీలుగా జిల్లాలో వివిధ ప్రాంతాల్లో ఇసుక లభ్యత ప్రదేశాలు ఏవైనా ఉన్నాయా అని పరిశీలించాలని ఆదేశించారు. అక్రమంగా ఇసుక తరలించకుండా టాస్క్‌ఫోర్స్ అధికారులు, సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి. నవ్య, గనుల శాఖ డీడీ రవిచంద్ర, కర్నూలు ఆర్డీవో సందీప్ , డీఎస్పీ బాబు ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ నాగేశ్వరరావు, డీపీఓ భాస్కర్, డీటీసీ శాంతకుమారి, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనలో వంద శాతం లక్ష్యాలు సాధించాలి

కర్నూలు కల్చరల్: ఉపాధి హామీ పనుల కల్పనలో వంద శాతం లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉపాధి హామీ, పల్లె పండుగ నిర్వహణ తదితర అంశాలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హొళగుంద, చిప్పగిరి, కృష్ణగిరి, తుగ్గలి, గూడూరు మండలాల్లో పనిదినాలు కల్పించకపోడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయా ఎంపీడీఓలకు, ఏఓలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని డ్వామా పీడీని ఆదేశించారు. జిల్లా ఉపాధి హామీ పథకం అమలుకు సంబంధించి నిర్దేశించిన లక్ష్యంలో 53 శాతమే సాధించారని, అందులో కర్నూలు, ఆదోని క్లస్టర్లు చివరి స్థానంలో ఉన్నాయన్నారు. జులై నుంచి నవంబర్ వరకు డిసిల్టింగ్, హౌసింగ్, హార్టికల్చర్ పనులు చేయించేలా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు పల్లె పండుగ వారోత్సవాలను అన్ని గ్రామాల్లో జరిగేలా పంచాయతీల వారీగా షెడ్యూల్ వేసుకుని నిర్వహించాలన్నారు. టెలీ కాన్ఫరెన్స్‌లో జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, డ్వామా ఇన్‌చార్జ్ పీడీ మాధవీలత పాల్గొన్నారు.

పడిపోయిన ధరలు.. రైతన్న దిగాలు!

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 15 వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉండగా.. కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో మాత్రమే వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాలు జరుగుతున్నాయి. వీటికి కూడా 10 శాతం వరకు మాత్రమే వ్యవసాయ ఉత్పత్తులు వస్తున్నాయి. మార్కెట్‌కు తీసుకెళ్లి అమ్ముకోవాలంటే రవాణా చార్జీలు భరించాల్సి ఉంది. పంటను అమ్మించిన ఏజెంటుకు 2 నుంచి 4 శాతం వరకు కమీషన్ ఇచ్చుకోవాలి. అన్‌లోడింగ్, కాటా, క్లీనింగ్ చార్జీలు అదనపు భారం. దీంతో రైతులు దళారీలను ఆశ్రయించి నష్టపోతున్నారు. ముందస్తుగా కొనుగోలు కేంద్రాలు లేకపోతే దళారీలు మద్దతు కంటే 25 నుంచి 35 శాతం తక్కువ ధరతో కొనుగోలు చేస్తారు. అయినప్పటికీ ఈ విషయంలో టీడీపీ ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది.

దళారీల రాజ్యం

- జిల్లాలోని మూడు మార్కెట్లలోనే లావాదేవీలు
- మార్కెట్‌లో ఉత్పత్తులకు తగ్గిన ధరలు
- పత్తి, వేరుశనగ, ఆముదం, సజ్జ, కొర్ర రైతుల ఆందోళన
- ఎక్కడా కనిపించని కొనుగోలు కేంద్రాలు
- ఇప్పటికీ స్పందించని ప్రభుత్వం

“ మార్కెట్‌లో అతి తక్కువ ధర



ఈ ఏడాది ఖరీఫ్‌లో రెండు ఎకరాల్లో సజ్జ సాగు చేశాం. 15 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. పెట్టుబడి రూ.30 వేల వరకు వచ్చింది. కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో వ్యాపారులు క్వింటా రూ.2,065 ధరతో కొనుగోలు చేశారు. పెట్టిన పెట్టుబడి వరకు మాత్రమే వచ్చింది. మద్దతు ధర రూ.2,615 ఉంది. కానీ మార్కెట్‌లో అతి తక్కువ ధరతో కొనుగోలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవట్లేదు. ఇలా అయితే రైతు బాగుపడేదెప్పుడు.

– నబీరసూల్, చిల్లబండ, కోడుమూరు మండలం

ఇలాగైతే వ్యవసాయం చేయలేం



1.60 ఎకరాల్లో వేరుశనగ సాగు చేశాం. 10 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. వేరుశనగ నాణ్యత ఎంతో బాగుంది. కనీసం రూ.6,500 ధర లభిస్తుందనే ఆశతో మార్కెట్‌కు వచ్చాం. కానీ రూ.5,971 ధర మాత్రమే లభించింది. మద్దతు ధర రూ.6,783 ఉంది. ఇలాగైతే వ్యవసాయం చేయలేం. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తేనే రైతులకు భరోసా లభిస్తుంది.

– జి.సుధాకర్, గుండ్లమల్లాపురం, కృష్ణగిరి మండలం

మార్కెట్‌లో పడిపోయిన ధరలు

- సజ్జలకు మద్దతు ధర రూ.2,615 ఉండగా మార్కెట్‌లో రూ.2వేల ధరనే లభిస్తోంది. గ్రామాల్లో దళారీలు రూ.1,800 వరకు మాత్రమే కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది.
- వేరుశనగ మద్దతు ధర రూ.6,783. మార్కెట్‌లో రైతులకు రూ.5 వేల నుంచి రూ.6వేల వరకు మాత్రమే ధర లభిస్తోంది.
- పత్తి మద్దతు ధర రూ.7,521. మార్కెట్‌లో రూ.7,360 పలుకుతోంది.
- కొర్రల మద్దతు ధర రూ.2,500. మార్కెట్‌లో రూ.2,600 వస్తోంది.
- రాగుల మద్దతు ధర రూ.4,290. మార్కెట్‌లో ధర రూ.3,500లకే పరిమితమైంది.
- మొక్కజొన్న మద్దతు ధర రూ.2,225. మార్కెట్‌లో రూ.2,200 ధర మాత్రమే ఉంది.
- పొద్దుతిరుగుడు మద్దతు ధర రూ.7,280. మార్కెట్‌లో రూ.5,869లకు పడిపోయింది.
- సోయాబీన్(పచ్చ) మద్దతు ధర రూ.4,892. మార్కెట్‌లో రూ.3,629లకు మించకపోవడం గమనార్హం.



ఆదోని మార్కెట్‌కు వచ్చిన పత్తి నిల్వలు

కర్నూలు(అగ్రికల్చర్): పంటల సాగుకు ఆరుగాలం శ్రమించే రైతన్న, దిగుబడులను అమ్ముకునేందుకు అంతకు రెట్టింపు కష్టాన్ని ఎదుర్కొంటున్నాడు. ధరలు పడిపోయి రైతులు కన్నీరు పెడుతున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లుగా కూడా లేకపోవడం గమనార్హం. ప్రతి ఏటా కేంద్ర ప్రభుత్వం జూన్ నెలలో కాస్ట్ ఆఫ్ కల్టివేషన్ ఆధారంగా మద్దతు ధరలను ప్రకటిస్తుంది. అంతకంటే ధరలు పడిపోయినప్పుడు ప్రభుత్వం వెంటనే మార్క్‌ఫెడ్, ఆయిల్‌ఫెడ్, పౌరసరఫరాల సంస్థలను రంగంలోకి దింపి మద్దతు ధరతో పంటలను కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాల్సి ఉంది. అయితే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఈ ఏడాది ఖరీఫ్‌లో సాధారణంతో పోలిస్తే సాగు విస్తీర్ణం పెరిగింది. సాధారణ సాగు 10,35,895 ఎకరాలు ఉండగా.. ఈ క్రాప్ బుకింగ్ ప్రకారం 10,55,454 హెక్టార్లలో పంటలు సాగయ్యాయి. ఖరీఫ్‌లో ప్రధానంగా పత్తి, కంది, ఆముదం, కొర్ర, మొక్కజొన్న, వేరుశనగ సాగు చేశారు. 45 రోజులుగా కోతలు సాగుతున్నాయి. ఆదోని మార్కెట్‌లో పత్తి, వేరుశనగ, ఆముదాలు మాత్రమే కొనుగోలు చేస్తారు. కర్నూలు మార్కెట్‌లో 13 రకాల పంటల క్రయవిక్రయాలు జరుగుతున్నాయి.

తగ్గిన దిగుబడులు

వర్షాభావంతో పాటు అధిక వర్షాలు పంటలను దెబ్బ తీశాయి. దీంతో ఈ ఏడాది ఖరీఫ్‌లో 20 నుంచి 30 శాతం వరకు దిగుబడులు తగ్గిపోయాయి. పత్తిలో ఎకరాకు పెట్టుబడి వ్యయం దాదాపు రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు వస్తుంది. దిగుబడులు మాత్రం ఎకరాకు సగటున 6 క్వింటాళ్లు మాత్రమే వస్తోంది. మార్కెట్‌లో పత్తికి లభిస్తున్న ధర రూ.7,300 మాత్రమే. మద్దతు ధర పత్తి(పొడుగు పింజ రకం)కి రూ.7,521 ఉంది. పత్తిలో సీసీఐ ద్వారా జిల్లాలో 4 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించినా ఇంతవరకు అతీగతీ లేకుండా పోయింది. వేరుశనగ, కొర్ర, సజ్జ రైతుల పరిస్థితి మరింత దయనీయంగా ఉంది.

వైఎస్సార్‌సీపీ పాలనలో ముందస్తు కొనుగోలు కేంద్రాలు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి రైతుకు మద్దతు ధర లభించాలనే లక్ష్యంతో వ్యవహరించింది. పంట దిగుబడులు మార్కెట్‌లోకి రాకముందే రైతులు దళారీల బారిన పడకుండా రైతుభరోసా కేంద్రం వారీగా ముందస్తుగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల్లో భరోసా నింపింది. ఐదేళ్లలో రికార్డు స్థాయిలో 4.86 లక్షల టన్నుల పంటలను మద్దతు ధరతో కొనుగోలు చేయడం విశేషం.

ఊసేలేని కొనుగోలు కేంద్రాలు

మార్కెట్‌లో ధరలు ఎక్కువగా ఉన్నాయని వ్యాపారులు రైతులను నిమ్మించి ఎక్కువ సరుకు వచ్చేలా చేస్తున్నారు. ఇందుకోసం ప్రతి పంటలో ఒకటి, రెండు చిన్న లాట్లకు రేటు ఎక్కువ ఇస్తున్నారు. సగటు ధరను ప్రామాణికంగా తీసుకుంటారు. సగటు ధర ప్రకారం చూస్తే రైతులు పండించిన అన్ని పంటలకు ధరలు పడిపోయాయి. మార్కెట్ యార్డుల్లో లభించే సగటు ధరలను బట్టి గ్రామాల్లో దళారీలు పంటలను కొంటున్నారు. మద్దతు కంటే ధరలు పడిపోయినప్పటికీ కొనుగోలు కేంద్రాల ఊసే లేకుండా పోయింది. ఇప్పటి వరకు 4 పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించినా కార్యరూపం దాల్చని పరిస్థితి. ఖరీఫ్‌లో పండించిన పంటల్లో ఇప్పటికే దాదాపు 50 శాతం మార్కెట్‌లోకి వచ్చినా ప్రభుత్వం నాన్చుడు ధోరణి కనపరుస్తోంది



కర్నూలు మార్కెట్‌కు వచ్చిన సజ్జ

“ ఇప్పటి వరకు ఎలాంటి ఆదేశాల్లేవు

ఖరీఫ్‌లో పండించిన పంటల కొనుగోలుకు సంబంధించి ఇంతవరకు ఎలాంటి ఆదేశాలు లేవు. ఉన్నత స్థాయిలో కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై చర్చలు జరుగుతున్నట్లు సమాచారం ఉంది. మొక్కజొన్న, సజ్జల కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై కసరత్తు నడుస్తోంది. ప్రభుత్వం నుంచి తగిన మార్గదర్శకాలు వస్తే అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటాం.

– జి.రాజు, మేనేజర్, మార్క్‌ఫెడ్

ఆ మూడు సీట్లు ఎవరి కోసం!

- రిజిస్ట్రేషన్ శాఖలో చక్రం తిప్పుతున్న ఓ ఉన్నతాధికారి
- కర్నూలు, కల్లూరు, ఆదోని ఎస్‌ఆర్‌ల నియామకాన్ని ఆపిన వైనం
- అనుకూలమైన వారిని ఇన్‌చార్జ్‌గా నియమించే ప్రయత్నం



ఖాళీగా దర్శనం ఇస్తున్న కల్లూరు సబ్ రిజిస్ట్రార్ కుర్చీ

కర్నూలు(సెంట్రల్): దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలనే ఆలోచనతో రిజిస్ట్రేషన్ శాఖలో ఓ ఉన్నతాధికారి వ్యవహరిస్తున్న తీరు అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల నేపథ్యంలో నిబంధనలు అతిక్రమించి మూడు సీట్లను ఎవరూ ఎంచుకోకుండా లోలోపల పావులు కదిపారు. అధికార పార్టీకి కొమ్ముకాస్తూ.. నాలుగు రాళ్లు వెనకేసుకునేందుకు తనకు అనుకూలమైన వారిని అక్కడ ఇన్‌చార్జ్‌లుగా నియమించే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 24 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీఓ 75 ప్రకారం ఆయా కార్యాలయాల్లో పనిచేసే అన్ని స్థాయిల ఉద్యోగులను బదిలీ చేశారు. రెండేళ్ల సర్వీసు ఉంటే తప్పని సరిగా బదిలీ చేయాలనే నిబంధన పెట్టారు. ఈ క్రమంలో జిల్లాలో 19 మంది సబ్ రిజిస్ట్రార్లను బదిలీ చేశారు. అయితే అత్యంత కీలకం, ఆదాయాన్ని సమకూర్చే కర్నూలు జాయింట్-1, కర్నూలు జాయింట్-2, కల్లూరు, ఆదోని, ఆస్పరి, అవుకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఎవరూ పనిచేసేందుకు సబ్ రిజిస్ట్రార్లు సుముఖతను వ్యక్తం చేయలేదని చెబుతున్నారు. ఇక్కడే అత్యంత కీలక పరిణామం చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. ఆ ఐదింటిలో ముఖ్యంగా కర్నూలు, కల్లూరు, ఆదోని సబ్ రిజిస్ట్రార్ల నియామకంలో ఎవరూ వాటిని ఎంచుకోకుండా ఆ ఉన్నతాధికారి పావులు కదిపినట్లు తెలుస్తోంది. అందుకోసమే ఆ ఉన్నతాధికారికి ఇష్టం లేకపోతే అక్కడికి రావడం ఎందుకని...ఎవరూ ఆ సెంటర్లను ఎంచుకోలేదని కొందరు సబ్ రిజిస్ట్రార్లు బహిరంగంగా చెబుతున్నారు. ఇదంతా ఆ ఉన్నతాధికారి ఎందుకు చేస్తున్నారంటే కొన్నాళ్ల తరువాత అనుకూలంగా పని చేసే వారిని ఇన్‌చార్జ్‌గా నియమించుకోవాలని చూస్తున్నట్లు తెలుస్తోంది. వారి ద్వారా వ్యవహారాలను చక్కబెట్టాలని ఆలోచనతోనే ఇదంతా చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

ప్రభుత్వ ఆదాయానికి గండి...

ఉమ్మడి జిల్లాలో రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారి వ్యవహరిస్తున్న తీరుతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడే అవకాశం ఉంది. కర్నూలు జాయింట్-1, జాయింట్-2ల ద్వారా రోజుకు దాదాపు 100 రిజిస్ట్రేషన్‌లు అవుతాయి. అలాగే కల్లూరులో దాదాపు 60, ఆదోనిలో 35 రిజిస్ట్రేషన్‌ల వరకు క్రయ, విక్రయాలు జరుగుతుంటాయి. వీటి ద్వారా ప్రభుత్వానికి నెలకు దాదాపు రూ.10 కోట్ల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉంది. అయితే రెగ్యులర్ సబ్‌రిజిస్ట్రార్‌లు లేకపోవడం.. వారి స్థానంలో ఇన్‌చార్జ్‌లుగా ఎస్‌ఆర్‌ఓలు నడుస్తుండడంతో ఆదాయంపై ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. ఇన్‌చార్జ్‌లుగా ఉన్న వారు ప్రతి దానికి ఉన్నతాధికారులపై ఆధారపడి ఉండాల్సి వస్తుంది. వారు నేరుగా ఏ నిర్ణయం తీసుకోవడానికి అవకాశం ఉండదు.

కళ తప్పిన కర్నూలు, కల్లూరు కార్యాలయాలు..

కర్నూలు, కల్లూరు, ఆదోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు నిత్యం క్రయ, విక్రయదారులతో కళకళలాడేవి. అయితే రెగ్యులర్‌గా సబ్ రిజిస్ట్రార్లు లేకపోవడంతో కళ తప్పాయి. ప్రస్తుతం ఇన్‌చార్జ్‌లుగా ఉన్న వారు ఏ డాక్యుమెంట్‌ను సక్రమంగా చూడడం లేదు. తాము కొన్నాళ్లే ఉంటామని, కొత్తగా వచ్చిన వారితో రిజిస్ట్రేషన్ ప్రక్రియలను నడిపించుకోవాలని చూస్తుండడంతో క్రయ, విక్రయదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయితే రెగ్యులర్ సబ్‌రిజిస్ట్రార్లను ఎప్పుడు నియమిస్తారో తెలియడం లేదు.

మిగిలింది ఒక్క రోజే

- జిల్లాలో 99 మద్యం దుకాణాలకు 1,676 దరఖాస్తులు
- నేటి సాయంత్రం 5 గంటలకు గడువు ముగింపు



కర్నూలు: నూతనంగా ఏర్పాటు కానున్న ప్రైవేటు మద్యం దుకాణాలకు దక్కించుకునేందుకు దరఖాస్తుల ప్రక్రియ ముగియడానికి ఒక రోజు మాత్రమే గడువు ఉంది. ఈనెల 1వ తేదీన ప్రారంభమైన ప్రక్రియ 9వ తేదీ సాయంత్రం ముగియనుంది. మంగళవారం సాయంత్రం 7 గంటలకు జిల్లా వ్యాప్తంగా నిర్దేశించిన 99 దుకాణాలకు 1,676 దరఖాస్తులు వచ్చాయి. 42వ నంబర్ దుకాణానికి కేవలం 1 దరఖాస్తే వచ్చింది. అలాగే ఆరు దుకాణాలకు రెండు దరఖాస్తులు, మూడు దుకాణాలకు మూడు దరఖాస్తులు, మరో మూడు దుకాణాలకు నాలుగు దరఖాస్తులు, నాలుగు దుకాణాలకు ఐదు దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. 35 దుకాణాలకు నామమాత్రంగానే దరఖాస్తులు వచ్చాయి. కర్నూలు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 31 దుకాణాలకు నోటిఫికేషన్ జారీ చేయగా 34వ నెంబర్ దుకాణానికి అత్యధికంగా 51 దరఖాస్తులు, 9వ నెంబర్ దుకాణానికి 43, 5వ నెంబర్ దుకాణానికి 37, 4, 92 దుకాణాలకు 32 చొప్పున దరఖాస్తులు వచ్చాయి. అలాగే 18వ నెంబర్ దుకాణానికి 35 దరఖాస్తులు వచ్చాయి. తెలంగాణ రాష్ట్రానికి చెందినవారు పెద్ద మొత్తంలో కర్నూలు దుకాణాలకు దరఖాస్తులు చేశారు. ఇందులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, బార్ల నిర్వాహకులు కలసి మద్యం దుకాణాలు దక్కించుకునేందుకు ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ పద్ధతిలో దరఖాస్తులు దాఖలు చేశారు. పట్టణ ప్రాంతాల దుకాణాలకు ఎక్కువగా దరఖాస్తులు చేస్తుండగా మండలాల్లోని దుకాణాలను దక్కించుకునేందుకు స్థానిక ప్రజాప్రతినిధుల జోక్యంతో మందకొడిగా సాగుతోంది. మరో రోజు గడువు ఉండటంతో కొన్ని ప్రాంతాల్లో ముందుగానే డీడీలు తీసిపెట్టుకుని దరఖాస్తులు కొనుగోలు చేసి పాత వ్యాపారులతో జట్టు కట్టేందుకు చర్చలు సాగిస్తున్నట్లు సమాచారం. బుధవారం సాయంత్రంతో మద్యం టెండర్లకు దరఖాస్తుల ప్రక్రియ పూర్తి కానుంది. తక్కువగా దరఖాస్తులు వచ్చిన దుకాణాలపై దృష్టి సారించి సాధ్యమైనంత ఎక్కువ మందితో దరఖాస్తులు చేయించి దరఖాస్తుల ఫీజు రూపంలో ప్రభుత్వానికి ఆదాయం రాబట్టడానికి ఎక్సైజ్ అధికారులు శ్రమిస్తున్నారు.

గ్రామ సమస్యలపై దృష్టి సారించాలి

- జెడ్పీ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి

కర్నూలు(అర్బన్): గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని జిల్లా పరిషత్ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ప్రాంగణంలోని డీపీఆర్‌సీ భవనంలో జిల్లాలోని డీఎల్‌పీఓ, ఎంపీడీఓ, ఈఓఆర్‌డీలకు శిక్షణా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి జిల్లా పరిషత్ సీఈఓ, డీపీఆర్‌సీ ప్రిన్సిపాల్ జీ నాసరరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి, వైస్ ప్రిన్సిపాల్ జీ భాస్కర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి మాట్లాడుతూ ఇక్కడ మూడు రోజుల పాటు శిక్షణ పొందిన అధికారులందరూ 15 రోజుల్లోగా తమ పరిధిలోని గ్రామాలన్నింటిని సందర్శించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అలాగే మేజర్ గ్రామ పంచాయతీల్లో ఆదాయాన్ని పెంచుకునేందుకు వీలుగా గుత్తేదారులతో పెట్టుబడి విధానంతో షాపింగ్ కాంప్లెక్స్‌లను నిర్మించుకునేందుకు చర్యలు చేపట్టాలన్నారు. జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో వీధి లైట్లు, తాగునీరు, పారిశుద్ధ్య విషయాల్లో నిబంధనల మేరకు నిధులు వెచ్చించి గ్రామాల్లో కనీస మౌళిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేయాలన్నారు. డీపీఓ భాస్కర్ మాట్లాడుతూ ఈ శిక్షణను సద్వినియోగం చేసుకొని ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకొని అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో కర్నూలు, ఆదోని డీఎల్‌పీఓలు తిమ్మక్క, నూర్జహాన్, ట్రైనింగ్ మేనేజర్ గిడ్డేష్, శ్రీకాళహస్తిలో శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనర్స్ పాల్గొన్నారు.

టెట్‌కు 270 మంది గైర్హాజరు

కర్నూలు సిటీ: ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) కు 270 మంది గైర్హాజరయ్యారు. ఉదయం జరిగిన పరీక్షకు 1,614 మందికి గాను 1,464 మంది హాజరయ్యారు. 150 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం సెషన్‌లో 1,612 మందికి గాను 1,492 మంది హాజరయ్యారు. 120 మంది గైర్హాజరయ్యారని విద్యాశాఖ అధికారులు వెల్లడించారు.

పుష్ప పల్లకీలో ఆది దంపతుల విహారం

- శ్రీశైలంలో వైభవంగా దసరా నవరాత్రి ఉత్సవాలు
- కాత్యాయనీ అలంకారంలో భ్రామరీ కటాక్షం



గ్రామోత్సవంలో కళాకారుల ప్రదర్శన



స్వామి అమ్మవార్లకు పుష్పపల్లకీ సేవ నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీశైలంటెంపుల్: అష్టాదశ శక్తిపీఠమైన శ్రీశైల మహాపుణ్యక్షేత్రంలో దసరా మహోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో ఆరో రోజు మంగళవారం భ్రమరాంబాదేవి కాత్యాయని స్వరూపంలో కటాక్షించారు. నాలుగు చేతుల్లో అభయ ముద్ర, కమలం, ఖడ్గాన్ని ధరించి భక్తులను కరుణించారు. రాత్రి భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామిఅమ్మవార్లు హంస వాహనంపై విహరించారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి ప్రాతఃకాల పూజలు, శ్రీచక్రార్చన, నవావరణార్చన, విశేష కుంకుమార్చనలు, జపానుష్ఠానాలు, పారాయణలు, రుద్రహోమం, చండీహోమం, అలాగే చతుర్వేద పారాయణలు, రుద్ర పారాయణలు, చండీపారాయణ, జపానుష్ఠానాలు, కుమారీపూజ, సుహాసిని పూజ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నారు. కాత్యాయని రూపంలోని అమ్మవారిని భక్తులు దర్శించుకుని ప్రత్యేక నీరాజనాలు సమర్పించారు. అలంకార మండపంలో హంస వాహనంపై అలంకరించిన స్వామిఅమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఉంచి ఆలయ అర్చకులు, వేదపండితులు విశేష పూజలు, హారతులిచ్చారు. అనంతరం కాత్యాయనీ దేవికి, హంస వాహనంపై కొలువుదీరిన స్వామిఅమ్మవార్లకు ఆలయ ఉత్సవాన్ని నిర్వహించారు. అనంతరం వివిధ పుష్పాలతో అలంకరించిన పుష్పపల్లకీపైకి స్వామిఅమ్మవార్లను చేర్చి కనులపండువగా గ్రామోత్సవం నిర్వహించారు.

శ్రీశైలంలో నేడు: దసరా నవరాత్రోత్సవాల్లో భాగంగా ఏడవ రోజు బుధవారం కాళరాత్రి అలంకారంలో భ్రమరాంబాదేవి, గజవాహనంపై భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లు దర్శనమివ్వనున్నారు.

క్లుప్తంగా

శ్రీశైల మల్లన్న సేవలో గోపీచంద్



మల్లన్న ఆలయంలో సినీ హీరో గోపీచంద్

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను సినీ హీరో గోపీచంద్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం మల్లన్న దర్శనార్థం హీరో గోపీచంద్ శ్రీశైలం చేరుకున్నారు. స్వామివారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన జరిపించారు. అమ్మవారి ఆలయం వద్ద గల ఆశీర్వచన మండపంలో హీరో గోపీచంద్‌కు పండితులు వేదమంత్రాలు పలుకగా, అర్చకులు ఆశీర్వచనం చేశారు. దర్శనం అనంతరం దేవస్థాన వేద పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న వారికి దుస్తులను అందజేశారు.

మాజీ ఎమ్మెల్యేపై బీజేపీ వేటు

ఆదోని అర్బన్: ఆదోని మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ జైన్‌ను బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ మంగళవారం సస్పెండ్ చేసింది. గత నెలలో వంద రోజుల పాలన కార్యక్రమంలో పార్టీకి, ఎమ్మెల్యే పార్థసారథికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేయడంపై ఐదు రోజుల్లో సమాధానం ఇవ్వాలని రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ నోటీసు ఇచ్చింది. దీనిపై ఎలాంటి సమాధానం రాకపోవడంతో ఆయన్ను సస్పెండ్ చేస్తూ పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ వెంకటసత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు.

పార్టీకి రాజీనామా

సస్పెన్షన్ ఉత్తర్వుల నేపథ్యంలో ప్రకాష్‌జైన్ మంగళవారం బీజేపీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే పార్థసారథి అనుసరిస్తున్న ఒంటెద్దు పోకడ, నిర్ణయాలు నచ్చక రాజీనామా చేస్తున్నట్లు చెప్పారు.

ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రెసిడెన్షియల్ డీఎస్సీ శిక్షణ

కర్నూలు(అర్బన్): రాష్ట్ర ప్రభుత్వం, సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖలు సంయుక్తంగా 5,050 మంది ఎస్సీ,ఎస్టీ విద్యార్థులకు రెసిడెన్షియల్ విధానంలో డీఎస్సీ శిక్షణ ఇవ్వనున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ సంయుక్త సంచాలకులు జె.రంగలక్ష్మీదేవి తెలిపారు. ఈ శిక్షణ రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన శిక్షణా సంస్థలు, సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖలు నిర్వహిస్తున్న స్టడీ సర్కిల్స్‌లో నిర్వహిస్తామనిమంగళవారం ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపానల్‌మెంట్ కోసం దరఖాస్తు చేసుకునే శిక్షణా సంస్థలు వివరాలను https://tender.apeprocurement.gov.in నుంచి డౌన్‌లోడ్ చేసుకొని ఈ నెల 21లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

దైవదర్శనానికి వచ్చి నదిలో గల్లంతు



సుబ్బరాయప్ప (ఫైల్)

మంత్రాలయం: రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చి తుంగభద్ర నదిలో స్నానం ఆచరిస్తూ ఓ భక్తుడు గల్లంతయ్యాడు. వివరాలు.. కర్ణాటక రాష్ట్రం చిక్‌బల్లాపూర్ గ్రామానికి చెందిన సుబ్బరాయప్ప (45) రాఘవేంద్ర స్వామి దర్శనార్థం మంగళవారం బంధువులతో కలిసి మంత్రాలయం వచ్చారు. నదిలో దిగి స్నానం చేస్తుండగా ప్రవాహ ఉధృతికి గల్లంతయ్యాడు. ఘటనపై కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చి పడవలతో గాలింపు చేపట్టారు. సుబ్బరాయప్ప భార్య పదేళ్ల క్రితమే అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో ఎనిమిదేళ్ల కుమార్తె అనాథగా మారింది. తమతోపాటు వచ్చిన సుబ్బరాయప్ప నదిలో గల్లంతు కావడంతో బంధువులు కన్నీరుమున్నీరయ్యారు.

శివ శివా.. ఇదేమి దోపిడయ్యా!

- రూ.1.30 కోట్ల నిధుల స్వాహాపై విచారణ
- సొంత ఖాతా తెరచి దోపిడీకి పాల్పడిన మాజీ ఈఓ ప్రసాద్
- నిధుల లావాదేవీలపై నిగ్గుతేల్చిన దేవదాయ శాఖ అధికారులు



కాల్వబుగ్గలో విచారణ చేస్తున్న దేవదాయ శాఖ అధికారులు



కాల్వబుగ్గ ఆలయం

ఓర్వకల్లు: దేవుడి సొమ్ము కొల్లగొట్టాలంటే ఎవరికైనా మనసు అంగీకరించదు. ఒకవేళ పొరపాటున ఆలయ నిధుల్లో అవకతవకలు జరిగితే రూ.వేలల్లోగానీ, రూ.లక్షల్లోగానీ అవినీతి జరిగిన సంఘటనలు ఉండొచ్చు. కానీ ఏకంగా రూ.1.30 కోట్లను స్వాహా చేయడం చర్చనీయాంశంగా మారిన సంఘటన మండలంలోని కాల్వబుగ్గ దేవస్థానంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ అవినీతి భాగోతం జిల్లాలో దుమారం రేపుతుంది. ఆలయ నిధుల స్వాహాపై దినపత్రికల్లో ఈ నెల 7వ తేదీన వార్తా కథనాలు ప్రచురితమైన విషయం తెలిసిందే. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుధాకర్‌రెడ్డి,ఇన్‌స్పెక్టర్ రమేష్, సీనియర్ అసిస్టెంట్ రఘురాంతో కూడిన బృందం మంగళవారం క్షేత్రస్థాయి విచారణ చేపట్టారు. అధికారులు తెలిపిన వివరాలు.. బుగ్గరామేశ్వరస్వామి ఆలయంలో 2018 నుంచి 2024 వరకు డీఆర్‌కేవీ ప్రసాద్ కార్యనిర్వహణాధికారి(ఈఓ)గా పనిచేశారు. ఆలయ అభివృద్ధి ముసుగులో దాతల నుంచి ఏటా రూ.లక్షల్లో విరాళాలు సేకరించడం, ఆలయ భూముల వేలం, ఆలయ భూముల్లో హైటెన్షన్ విద్యుత్ టవర్లు నిర్మించడం వల్ల వచ్చిన పరిహారం సొమ్మును ఆలయ ఖాతాలో జమ చేయాల్సి ఉంటుంది. ఈఓ ప్రసాద్‌కు ఈ నిధులపై కన్నుపడింది. ఎలాగైనా కొల్లగొట్టాలని పథకం రచించారు. అనుకున్నదే తడవుగా 2020లో హుసేనాపురం ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో వ్యక్తిగత ఖాతాను తెరచి ఆలయ నిధులను దశలవారీగా జమచేసుకొని వాడుకున్నట్లు గుర్తించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ఉన్నతాధికారులు ప్రసాద్‌ను కాల్వబుగ్గ నుంచి యాగంటి దేవస్థానానికి బదిలీ చేశారు. దీంతో అప్రమత్తమైన ప్రసాద్ 30-8-2024న సదరు బ్యాంకు ఖాతాను క్లోజ్ చేశాడు. అధికారులు సమగ్రంగా చేపట్టిన విచారణలో మొత్తం రూ.1.30 కోట్లు దోపిడీకి గురైనట్లు నిజాలను నిగ్గుతేల్చారు. ఈ అవినీతి భాగోతంపై ఆర్‌జేడీ కార్యాలయానికి నివేదిస్తామని వారు పేర్కొన్నారు.

క్రిమినల్ కేసు నమోదు చేయాలి

దేవస్థాన నిధులను కొల్లగొట్టిన కాల్వబుగ్గ ఈఓ డీఆర్‌కేవీ ప్రసాద్‌పై క్రిమినల్ కేసు నమోదు చేసి, చట్టపరంగా శిక్షించాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. కాల్వబుగ్గ దేవస్థానంలో రూ.1.30 కోట్ల నిధుల స్వాహా వ్యవహారంపై మంగళవారం సీపీఐ మండల కన్వీనర్ రమేష్, సీపీఎం మండల కన్వీనర్ నాగన్న సమక్షంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఆలయ ఆస్తులను కాపాడాల్సిన అధికారులే, నిధుల దుర్వినియోగానికి పాల్పడడం చట్టరీత్యా నేరమన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా దోపిడీకి గురైన నిధులను రికవరీ చేసి, ఇందుకు పాల్పడిన ఈఓను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఆయా సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హత్యకేసులో వ్యక్తికి జీవితఖైదు



పోలీసుల అదుపులో నిందితుడు

బొమ్మలసత్రం/గోస్పాడు: భార్యను అతికిరాతకంగా గొడ్డలితో నరికి చంపిన కేసులో నిందితుడైన భర్తకు ఆళ్లగడ్డ కోర్టు మంగళవారం జీవితఖైదు విధించినట్లు ఎస్పీ అదిరాజ్‌సింగ్‌రాణా తెలిపారు. గోస్పాడు మండలం యం.క్రిష్టాపురం గ్రామానికి చెందిన నేసే బాలన్న తన పెద్ద కుమారుడు జయన్న వివాహం కుదిర్చే విషయంలో భార్యతో గొడవ పడ్డాడు. ఈ క్రమంలో 2022 ఏప్రిల్ 6న ఇంట్లో నిద్రిస్తున్న భార్యను బాలన్న గొడ్డలితో అతి కిరాతకంగా నరికి హత్య చేశాడు. ఘటనపై చిన్న కుమారుడు సంజీవరాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన గోస్పాడు పోలీసులు ఆధారాలు, సాక్ష్యాలు సేకరించి కోర్టులో సమర్పించారు. స్పీడ్ ట్రయల్ మానిటరింగ్ ద్వారా కేసును ముందుకు నడిపి నిందితుడిని మంగళవారం బోనులో నిలబెట్టారు. ఈ క్రమంలో నేరం రుజువు కావడంతో నిందితునికి జీవితఖైదు శిక్ష విధిస్తూ రూ.1000 జరిమానా చెల్లించేలా ఆళ్లగడ్డ కోర్టు జడ్జి మురళీకృష్ణ తీర్పునిచ్చారు.

జీఎన్ఎస్ఎస్‌లో బాలుడి గల్లంతు



మధురుషి (ఫైల్)

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటిపల్లె గ్రామానికి చెందిన ఐదవ తరగతి విద్యార్థి గజ్జల మధురుషి (11) గ్రామ సమీపంలోని జీఎస్ఎస్ఎస్ ప్రధాన కాల్వలో జారిపడి గల్లంతయ్యాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన సుధాకర్, లక్ష్మీదేవి దంపతులకు రాంచరణ్, మధురుషి ఇద్దరు కుమారులు ఉన్నారు. మధురుషి గ్రామంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్నాడు. మంగళవారం గ్రామంలోని గాలేరు నగరి సుజల స్రవంతి (జీఎన్ఎస్ఎస్) కాల్వ పక్కన పెద్దమ్మ గుడి వద్ద అన్నదానం జరుగుతుండడంతో తండ్రి సుధాకర్‌తో పాటు వెళ్లాడు. అక్కడ స్నేహితులతో కలిసి ఆడుకుంటుండగా ప్రమాదవశాత్తు కాలు జారి కాల్వలో పడ్డాడు. పక్కనున్న వారు రక్షించేందుకు ప్రయత్నించగా నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో బాలుడు గల్లంతయ్యాడు. గజఈతగాళ్లతో పాటు, బనగానపల్లె పోలీసులు, గ్రామస్తులు కాల్వ వెంట గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. చీకటి పడడంతో గాలింపు చర్యలు నిలిపివేశారు.

కర్నూలు బస్టాండును ఆదర్శంగా తీర్చిదిద్దుతాం



నూతన బస్సు ప్రారంభ పూజలో పాల్గొన్న మంత్రి టీజీ భరత్

కర్నూలు సిటీ: కర్నూలు బస్టాండును రాష్ట్రంలోనే నంబరు వన్‌గా తీర్చిదిద్దుతామని మంత్రి టీజీ భరత్ అన్నారు. మంగళవారం కర్నూలు-1 డిపో గ్యారేజీలో 3 కొత్త బస్సులను మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రయాణికుల సౌకర్యార్థం గత మూడు నెలల్లో 13 కొత్త బస్సులను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. కొత్తగా ప్రారంభించిన మూడింటిలో కర్నూలు - బెంగళూరు రెండు సూపర్ లగ్జరీ, కర్నూలు - తిరుపతి ఒక అల్ట్రా డీలక్స్ బస్సు ఉన్నాయన్నారు. భవిష్యత్తులో మరిన్ని సర్వీసులతో పాటు, ప్రజల సురక్షిత ప్రయాణానికి కావాల్సిన ఏర్పాట్లన్నీ చేసే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. బస్టాండులో కన్వెన్షన్ హాలు నిర్మించేందుకు ప్లాన్ తయారు చేయాలని జిల్లా ప్రజా రవాణా అధికారి టి.శ్రీనివాసులకు సూచించారు. డిపో మేనేజర్లు సుధారాణి, సర్దార్ హుసేన్, అసిస్టెంట్ మేనేజర్లు, సూపర్‌వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

ధరలను నియంత్రణకు చర్యలు

కర్నూలు కల్చరల్: ఉల్లి, టమాటా ధరలను నియంత్రణలో ఉంచాలని మంత్రి టీజీ భరత్ అధికారులను ఆదేశించారు. ధరల నియంత్రణపై మంగళవారం మంత్రి జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషాతో కలిసి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో ఉల్లి, టమోటా ధరలు పెరగకుండా ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్యాపిలి నుంచి రోజుకు 3 టన్నుల టమాటా తెప్పిస్తున్నట్లు చెప్పారు. టమాట ధర రూ.40 నుంచి రూ.45లోపు, ఉల్లి ధర రూ.36 ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే వంట నూనెల ధరల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సబ్‌కలెక్టర్, ఆర్డీఓలు, తహసీల్దార్లు రైతుబజార్లు, మార్కెట్ యార్డులను తనిఖీ చేసి అధిక ధరకు విక్రయిస్తుంటే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జేసీ డాక్టర్ బి.నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఆర్డీఓలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చెన్నై తొక్కిసలాటలో పాణ్యం వాసి మృతి



దినేష్ (ఫైల్)

పాణ్యం: చెన్నైలో ఈనెల 6వ తేదీన ఎయిర్ షో అనంతరం జరిగిన తొక్కిసలాటలో నంద్యాల జిల్లా పాణ్యంకు చెందిన దినేష్ మృత్యువాత పడ్డారు. గ్రామానికి చెందిన రామచంద్రుడు, రామలక్ష్మమ్మ దంపతుల కుమారుడు దినేష్ (39) చెన్నైలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తూ అక్కడే స్థిరపడ్డారు. తొక్కిసలాటలో మృతి చెందడంతో ఆయన మృతదేహాన్ని మంగళవారం పాణ్యంకు తీసుకొచ్చి అంత్యక్రియలు చేశారు. మృతుడికి భార్య మహాలక్ష్మితో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

- మరో నలుగురికి తీవ్రగాయాలు



బాలుడి మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి నరసమ్మ

పెద్దకడబూరు/ఆదోని అర్బన్: మండల పరిధిలోని బసలదొడ్డి గ్రామానికి చెందిన మల్లేష్, నరసమ్మ దంపతుల కుమారుడు వీరేష్ (13) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మల్లేష్ తల్లి హనుమంతమ్మ కూరగాయలు అమ్మి జీవనం సాగిస్తుంది. వీరేష్ విద్యానగర్ ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. వీరేష్‌కు దసరా సెలవులు కావడంతో నానమ్మ కూరగాయలు తీసుకొచ్చేందుకు ఆదోనికి వెంట తీసుకెళ్లింది. మంగళవారం ఉదయం 5.30 గంటల సమయంలో హాలికన్వీ గ్రామ సమీపంలో వారు వెళుతున్న ఆటోను టెంపో అతివేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వీరేష్ అక్కడికక్కడే చనిపోగా మిగతా నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని అంబులెన్స్‌లో ఆదోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఒక్కగానొక్క కుమారుడు మృత్యువాత పడడంతో కుటుంబసభ్యుల రోదనలు కంటతడి పెట్టించాయి. బాలుడి తండ్రి మల్లేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ నిరంజన్ రెడ్డి తెలిపారు.

ఇద్దరు తహసీల్దార్లపై చర్యలకు ఆదేశం

జూపాడుబంగ్లా: మండలంలోని 80బన్నూరు రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 126ఏ లోని 2.22 ఎకరాల రస్తాపోరంబోకు భూమికి పట్టాలిచ్చి, ఆన్‌లైన్ చేశారనే విషయమై తహసీల్దార్ ఆనంద్, రిటైర్డ్ తహసీల్దార్ జాకీర్‌హుసేన్‌లపై చర్యలకు కలెక్టర్ ఆదేశించారు. దీనిపై మంగళవారం తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్ తెలిపిన వివరాల మేరకు.. సదరు స్థలాన్ని సబ్‌డివిజన్ చేసి గ్రామానికి చెందిన రాజేంద్రప్రసాద్ అనే వ్యక్తికి 130 సెంట్లు, వడ్డె కృష్ణకు 44 సెంట్లు, దేవమ్మకు 48 సెంట్ల చొప్పున 2006 నవంబర్ 7న అప్పటి తహసీల్దార్ ఆనంద్ డీ పట్టాలిచ్చారు. ఈ డీ పట్టాలను 2016 ఫిబ్రవరి 20న అప్పటి తహసీల్దార్ జాకీర్‌హుసేన్ ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా రస్తాపోరంబోకు స్థలంలో డీపట్టాలు మంజూరు చేసిన అప్పటి తహసీల్దార్ ఆనంద్ (ప్రస్తుతం అనంతపురం జిల్లాలో ఎస్‌డీసీగా ఉన్నారు), ఆన్‌లైన్‌లో పొందుపరచిన తహసీల్దార్ జాకీర్‌హుసేన్ (ప్రస్తుతం రిటైర్డ్ అయ్యారు) పై శాఖాపరమైన చర్యలు తీసుకోవటంతో పాటు, డీ పట్టాలు రద్దు చేయాలని ఆత్మకూరు ఆర్డీఓ ఎం.దాసు, తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్‌ను ఆదేశిస్తూ కలెక్టర్ రాజకుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులను స్థలం సాగుచేసుకుంటున్న రాజేంద్రప్రసాద్, వడ్డెకృష్ణ, దేవమ్మలకు అందజేశారు.

ఉల్లిగడ్డల లారీ బోల్తా

పాణ్యం: మండల పరిధిలోని తమ్మరాజుపల్లె-సిమెంట్‌నగర్ ఘాట్‌లో బుధవారం ఉల్లిగడ్డల లోడ్‌తో వెళ్తున్న లారీ మలుపులో బోల్తా పడిందని హైవే పోలీసులు తెలిపారు. డోన్ నుంచి తాడేపల్లికి ఉల్లిగడ్డ లోడ్‌తో వెళ్తుండగా బ్రేక్‌లు ఫెయిల్ కావడంతో లారీ బోల్తా పడిందన్నారు. ఈ ఘటనలో లారీ యజమాని బాలచంద్ర, డ్రైవర్‌కు గాయాలయ్యాయని చెప్పారు. హైవే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని గాయపడినవారిని నంద్యాల ఆసుపత్రికి తరలించారు.

యూట్యూబ్ చూసి గంజాయి సాగు



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ తిమ్మారెడ్డి

సి.బెళగల్: మండలంలో నమోదైన గంజాయి కేసు వివరాలను ఎస్ఐ తిమ్మారెడ్డి మంగళవారం వెల్లడించారు. కోడుమూరు సీఐ తబ్రేజ్‌కు మండలంలో గంజాయి సాగుపై వచ్చిన సమాచారం మేరకు తాను ఎక్సైజ్ సీఐ మంజుల, సి.బెళగల్ డీటీ పురుషోత్తం, వీఆర్వో వెంకటేశ్వర్లు, గూడూరు, కోడుమూరు పోలీసులు, సిబ్బందితో కలిసి పలుకుదొడ్డి (చెరువుపల్లె) గ్రామంలో మిద్దె భూపతి రాముడు, సి.బెళగల్‌కు చెందిన హనుమంతును అదుపులోకి తీసుకుని 6.1 కేజీల గంజాయి ఆకులను స్వాధీనం చేసుకున్నామన్నారు. మిద్దె భూపతిరాముడును విచారించగా యూట్యూబ్‌లో చూసి ఎక్కువ డబ్బు సంపాదించాలనే దురాశతో నాలుగు నెలల క్రితం హనుమంతు వద్ద గంజాయి విత్తనాలు తీసుకుని తన మిరప పంటలో నాటినట్లు చెప్పాడన్నారు. ఈ నెల 7న నిందితులిద్దరూ గంజాయి మొక్కల నుంచి ఆకులను తెంపి తీసుకెళుతుండగా పట్టుకుని గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు పంపినట్లు వెల్లడించారు.

పల్లెల్లో సూక్ష్మ పోషకాల దందా

డీఏపీ, పొటాష్ పేర్లతో విక్రయాలు

- సీఎంఎస్ బస్తా ధర రూ.500 నుంచి రూ.550
- డీఏపీ ధర రూ.1,350



తెలంగాణ నుంచి దిగుమతి చేసుకున్న సూక్ష్మ పోషకాలు

కర్నూలు(అగ్రికల్చర్): గ్రామీణ ప్రాంతాల్లో సూక్ష్మ పోషకాలనే పొటాష్, డీఏపీ ఎరువులుగా విక్రయిస్తున్నారు. ఈ విషయం వ్యవసాయ అధికారుల దృష్టికి వెళ్లినా కనీస చర్యలు లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. కాల్షియం, మెగ్నీషియం, సల్ఫర్(సీఎంఎస్) అనేవి సూక్ష్మ పోషకాలకు సంబంధించినవి. ఇవి పొటాష్, డీఏపీ తరహాలో గులికల రూపంలో లభిస్తాయి. పోషక లోపాలను నివారించేందుకు మాత్రమే వీటిని వినియోగిస్తారు.అయితే కొందరు అక్రమార్కులు అత్యాశతో సీఎంఎస్ బ్యాగులను గ్రామీణ ప్రాంతాలకు తీసుకెళ్లి డీఏపీ, పొటాష్ ఎరువులుగా విక్రయిస్తున్నారు. సి.బెళగల్, దేవనకొండ, గూడూరు, ఎమ్మిగనూరు,ఆదోని, పెద్దకడుబూరు తదితర మండలాల్లోని గ్రామాల్లో సూక్ష్మ పోషకాల దందా సాగుతోంది.

యువతకు ఉద్యోగాలంటూ..

కర్నూలు, నంద్యాలకు చెందిన కొందరు భూదార్, డైమండ్ పేర్లతో సూక్ష్మపోషకాలకు వ్యవసాయ శాఖ నుంచి అనుమతులు తీసుకున్నట్లు తెలుస్తోంది. సూక్ష్మ పోషకాల్లో సీఎంఎస్ అనేది కీలకం. ఇవి గుళికల రూపంలో డీఏపీ, పొటాష్ ఎరువులను పోలి ఉంటాయి. దీనిని అవకాశంగా తీసుకొని గ్రామాల్లో పొటాష్, డీఏపీల పేర్లతో అమ్మకాలు సాగిస్తున్నట్లు స్పష్టమవుతోంది. గ్రామీణ ప్రాంతాలకు చెందిన యువతకు ఉద్యోగాల పేరుతో ఆకర్షించి వారి ద్వారా అమ్మకాలు సాగిస్తుండటం గమనార్హం. కాల్షియం, మెగ్నీషియం, సల్ఫర్ బస్తా ధర రూ.500 నుంచి రూ.550 వరకు ఉంటుంది. దీనిని తెలంగాణ నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. డీఏపీ రూ.1350, పొటాష్ రూ.1100 వరకు ఉంది. తగ్గింపు ధరలకు విక్రయిస్తున్నట్లు రైతులను ఆకర్షిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో డీఏపీ పేరుతో రూ.1200, మరికొన్ని ప్రాంతాల్లో పొటాష్ పేరులో రూ.1000 ప్రకారం అంటగడుతున్నారు. అయితే వీటిని వాడిన తర్వాత పంటలు ఎర్రగా మారుతున్నట్లు ఫిర్యాదులు ఉంటున్నాయి.

గొర్రెల పెంపకందారుల యూనియన్ ఎన్నికలు ఏకగ్రీవం



నూతన పాలకవర్గాన్ని అభినందిస్తున్న కురువ సంఘం నేతలు గడ్డం రామకృష్ణ తదితరులు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్‌కు నూతన పాలకవర్గం ఏకగ్రీవంగా ఏర్పాటైంది. ఈసారి అన్ని వర్గాలు అవగాహనకు రావడంతో అధ్యక్ష పదవి కురువ సామాజిక వర్గానికి లభించింది. యూనియన్ ఎన్నికలకు సంబంధించి ఈ నెల 5న నామినేషన్ ప్రక్రియ ముగిసింది. 12 మంది డైరెక్టర్ల ఎన్నికకు గాను 31 మంది నామినేషన్లు దాఖలు చేశారు. సోమవారం నామినేషన్ల పరిశీలన, మంగళవారం ఉపసంహరణ జరిగింది. నామినేషన్లు దాఖలు చేసిన వారిలో 19 మంది ఉపసంహరించుకున్నారు. దీంతో 12 స్థానాలకు 12 నామినేషన్‌లు మాత్రమే మిగలడంతో ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది. ఆఫీసు బేరర్లను కూడా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సల్కాపురం శ్రీనివాసులు ఎన్నిక కాగా.. వైస్ చైర్మన్‌గా బండి ఆత్మకూరుకు చెందిన బాలగురప్ప యాదవ్ ఎన్నికయ్యారు. డైరెక్టర్లుగా మద్దిలేటి, రాముడు, అయ్యన్న యాదవ్, యుగంధర్, ఎం.శ్రీనివాసులు, ఎస్.చంద్రశేఖర్, అనిమిరెడ్డి, వెంకటేశ్వర్లు, ఎం.మద్దయ్య, ఉపేంద్రస్వామి ఎన్నికయ్యారు. ఈ నెల 22న ఆఫీసు బేరర్లు పదవీ ప్రమాణ స్వీకారం చేస్తారని యూనియన్ వర్గాలు తెలిపాయి. నూతన పాలకవర్గం ప్రతినిధులకు జిల్లా కురువ సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు, మాజీ అధ్యక్షుడు గడ్డం రామకృష్ణ, అసోసియేట్ అధ్యక్షుడు గుడిసె శివన్న, ప్రధాన కార్యదర్శి రంగస్వామి, కార్పొరేటర్ సిత్రా సత్యనారాయణమ్మ, జిల్లా ఉపాధ్యక్షుడు ధనుంజయ తదితరులు అభినందనలు తెలిపారు

కేబుల్ నెట్‌వర్క్‌లో నీలిచిత్రాల ప్రసారం

- పోలీసులకు ఫిర్యాదు చేసిన ప్రజలు

నందికొట్కూరు: నంద్యాల జిల్లా నందికొట్కూరు పట్టణంలోని ఓ ప్రైవేటు కేబుల్ నెట్‌వర్క్‌లో నీలిచిత్రాలు ప్రసారం కావడంతో ప్రజలు అవాక్కయ్యారు. నందికొట్కూరు పట్టణంలోని ఫిరోజ్ డిజిటల్ నెట్‌వర్క్ నుంచి పగిడ్యాల, జూపాడుబంగ్లా, నందికొట్కూరు టౌన్, మండలాల్లోని ప్రజలు డిష్ కనెక్షన్ పొందారు. కాగా మంగళవారం మధ్యాహ్నం ఇళ్లల్లో టీవీ చూస్తుండగా అకస్మాత్తుగా నీలిచిత్రాలు ప్రసారమైన విషయం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. కొందరు వ్యక్తులు వెంటనే కేబుల్ నెట్‌వర్క్ యజమాని షబ్బీర్‌కు ఫోన్ చేసి విషయం చెప్పడంతో నిలిపివేశారు. నీలిచిత్రాలు ప్రసారం కావడంతో ఫిరోజ్ డిజిటల్ యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై పగిడ్యాల మండల కేంద్రానికి చెందిన ఉదయ్ కిరణ్‌రెడ్డితో పాటు మరి కొందరు కేబుల్ నెట్‌వర్క్ యాజమాని షబ్బీర్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గొంతులో చేప ఇరుక్కుని..

వెల్దుర్తి(కృష్ణగిరి): చేపల వేటకు వెళ్లిన ఓ వ్యక్తికి గొంతులో చేప ఇరుక్కుని ప్రాణం మీదకు తెచ్చుకున్న సంఘటన వెల్దుర్తి మండల పరిధిలోని బోగోలు గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన వెంకటస్వామి సోమవారం చేపల వేటకు వెళ్లాడు. ఒకదాని తర్వాత మరో చేపను పట్టుకునే క్రమంలో చేపను నోటితో పట్టుకున్నాడు. నోట్లో పళ్లు లేకపోవడంతో పట్టు లేక చేప జారి గొంతులో ఇరుక్కుపోయింది. కక్కలేక, మింగలేక ఇబ్బందులు పడుతున్న అతన్ని కుటుంబసభ్యులు వెంటనే డోన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం 108లో కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా గొంతులో ఇరుక్కున్న చేపను వైద్యులు తొలగించారు.

సుంకేసులకు వరద

కర్నూలు సిటీ: ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దు ప్రాంతంలో కురిసిన వర్షాలకు వేదావతి నది ఉప్పొంగడంతో తుంగభద్ర నదికి చేరుకున్న వరద నీరు సుంకేసుల బ్యారేజీకి చేరుకుంటుంది.మంగళవారం బ్యారేజీకి వరద నీటి ప్రవాహం కొనసాగుతోంది. 20,365 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 2,445 క్యూసెక్కులు, కేసీ కాలువకు, 17,916 క్యూసెక్కుల నీటిని నాలుగు గేట్లు పైకెత్తి శ్రీశైలానికి విడుదల చేస్తున్నారు.

'పల్లె పండుగ'ను విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ పీడీ మాధవీలత

కర్నూలు(అగ్రికల్చర్): మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పల్లె పండుగ వారోత్సవాలను విజయవంతం చేయడంపై కన్వర్జెన్సీ శాఖల అధికారులు దృష్టి సారించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఇన్‌చార్జ్ ప్రాజెక్టు డైరెక్టర్ మాధవీలత సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని డ్వామాలో వివిధ శాఖల అధికారులతో కన్వర్జెన్సీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ పీడీ మాట్లాడుతూ.. ఈ నెల 14 నుంచి 21వ తేదీ వరకు ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పల్లె పండగ వారోత్సవాలు జరుగుతున్నాయని, ఈ కార్యక్రమాల్లో కన్వర్జెన్సీ శాఖల అధికారులందరూ పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు. ఈ వారోత్సవాల్లో మెటీరియల్ కాంపోనెంటు కింద సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, పశువుల షెడ్లు, ఫాంపాండ్ వంటి పనులకు భూమిపూజ నిర్వహించి, పనులను మూడు నెలల్లో పూర్తి చేయాలని, సంక్రాంతి సమయంలో ఈ పనులకు ప్రారంభోత్సవం చేయాలనేది ప్రభుత్వ ఉద్దేశమని వివరించారు. జిల్లా పరిషత్ సీఈఓ నాసరరెడ్డి, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రమాదాల సముద్రం మీద 8 నెలల పాటు ప్రపంచ దేశాలు తిరిగి రావడానికి ఇద్దరు సాహస నేవీ మహిళా అధికారులు దిల్నా, రూపా అక్టోబర్ 2న గోవా నుంచి బయలుదేరారు.
కేవలం వారిద్దరు మాత్రమే ఉండే ఈ సాహసభరిత యాత్రలో వారు తోడు తీసుకెళుతున్నవి ఏమిటి? వారికి తోడుండేవి ఏమిటి?
ఇంత సాహసం చేసే వీరిని చూస్తే ప్రతి అమ్మాయిలోనూ కలగదా సముద్రమంత సాహస భావన!


రూప
దిల్నా

● శక్తి

ఆటుపోట్లకు వెరవని 'షి'జర్నీ

'గమ్యం ఎలాగూ ముఖ్యమే. కాని ప్రయాణం కూడా ముఖ్యం. ఈ యాత్రలోని ప్రతి క్షణాన్నీ ఆస్వాదించండి' అని అక్టోబర్ 2న గోవాలో జెండా ఊపి భవిష్యత్ చరిత్రలో చిరస్థాయిగా నిల బడనున్న 'నావికా సాగర్ పరిక్రమ–2'ను ప్రారం భించారు నేవీ చీఫ్ అడ్మిరల్ దినేష్ కె త్రిపాఠి. కేవలం ఇద్దరు మహిళా నేవీ ఆఫీసర్లు ఐఎన్ఎస్వి తారిణి పేరున్న సెయిల్ బోట్‌లో ఎనిమిది నెలల పాటు చేయనున్న ఈ సాహసయాత్ర విజయ వంతం కావాలని ఈ కార్యక్రమానికి హాజరైన ప్రతి ఒక్కరూ కోరుకున్నారు.

ఐదు అంచెల యాత్ర

యాభై ఆరు అడుగుల పొడవుండే సెయిల్ బోట్ తారిణిలో కమాండర్లు దిల్నా, రూప ఒకరికి ఒకరు తోడుగా నిలిచి మొత్తం 23000 నాటికల్ మైళ్ల అంటే 40000 కిలోమీటర్లు ప్రయాణం చేయాలి. అక్టోబర్ 2న గోవా నుంచి బయలుదే రిన వీరు ఈ యాత్రను ఐదు భాగాలుగా చేస్తారు.

1. గోవా నుంచి ఆస్ట్రేలియా 2.ఆస్ట్రేలియా నుంచి న్యూజిలాండ్ 3. న్యూజిల్యాండ్ నుంచి ఫాక్‌ల్యాండ్ ఐలాండ్స్ (దక్షిణ పసిఫిక్ సముద్రం) 4.ఫాక్‌ల్యాండ్ నుంచి సౌత్ ఆఫ్రికా 5. సౌత్ ఆఫ్రికా నుంచి గోవా. భారతీయ మహిళలు అత్యంత శక్తిమంతులని ప్రపంచ దేశాలకు చాటి చెప్పేందుకు సాగుతున్న ఈ యాత్ర కోసం తరిణికి సారథిగా లెఫ్టినెంట్ కమాండర్ దిల్నా.కే వ్యవహరిస్తుండగా.. మరో లెఫ్టినెంట్ కమాండర్ రూపా సారథ్యం వహిస్తున్నారు.

మైక్రోప్లాస్టిక్స్‌పై పరిశోధన

'నావికా సాగర్ పరిక్రమ–2' మన స్త్రీ శక్తిని నిరూపించడానికే కాదు 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ'తో అనుసంధానమై సముద్ర జలాల్లోని మైక్రోప్లాస్టిక్స్‌ను అధ్యయనం చేయడా నికి కూడా ఉపయోగపడనుంది. అలాగే 'వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా'తో కలిసి సముద్రాల లోని పుష్పపత్రాలు, భారీ సముద్ర జీవులపై కూడా పరిశోధనకు అవసరమైన సమాచారం కూడా సేకరిస్తారు. వీటన్నింటికి వీలుగా 'తారిణి 'ని సిద్ధం చేశారు. ఈ బోట్ ముందు భాగంలో మాస్ట్‌సెయిల్స్ ఉంటాయి. వెనుక భాగంలో రెండు స్టీరింగ్ వీల్స్, ఆటో పైలట్ సిస్టమ్, నెలకు 20 జీబీ వినియోగించుకునే సౌక ర్యంతో కూడిన శాటిలైట్ యాంటెన్నా ఉంటుంది. సముద్ర జలాల్ని శుద్ధి చేసి గంటకు 30 లీటర్ల మంచినీరు ఇవ్వగల ఆర్వో ప్లాంట్ అమర్చారు. అవసరమైన సందర్భాల్లో వినియోగించుకునేం దుకు 22 తాళ్లను అందుబాటులో ఉంచారు. ల్యాప్‌టాప్‌లు, మ్యూజిక్ సిస్టం సైతం బోట్‌లో ఉన్నాయి.

బోట్ తయారీలో అధికభాగం ఫైబర్ గ్లాస్‌ను ఉపయోగించారు. వీరి యాత్రను జీపీఎస్ విధానం ద్వారా ట్రాక్ చేస్తూ ప్రయాణం ఎలా సాగుతోందో భారత నౌకా దళం నిరంతరం పర్యవేక్షి స్తుంటుంది.

సోదరి ఇచ్చిన పాండా బొమ్మతో

'ప్రయాణం చేయడానికి భయం లేదని చెప్పడం లేదు. కానీ అంతకుమించిన ఆత్మ విశ్వాసం కూడా ఉంది. ఈ ప్రయాణంలో నాకు తోడుగా ఉంటుందని నా సోదరి పాన్‌పాన్ అని పిలుచుకునే పాండా బొమ్మ ఇచ్చింది. దీంతో పాటు ఖగోళశాస్త్రవేత్త కార్ల్‌సాగన్ రచించిన పుస్త కాలు తోడు తీసుకెళ్తున్నాను' అంది లెఫ్టినెంట్ కమాండర్ రూపా ఈ సందర్భంగా.

అమ్మ చేసిన ఊరగాయలతో

'సముద్రం ఒక గొప్ప గురువు. మాకు సహ నాన్ని నేర్పిస్తుంది. బోట్‌ను మనం మంచిగా చూసుకుంటే, అది మనల్ని మంచిగా చూసుకుం టుందనే సూత్రాన్నే పాటిస్తాను. తరిణిలో మేమే ఇంజినీర్లం, ఎలక్ట్రీషియన్లం, కార్పెంటర్లం. వాతా వరణ నివేదికల్ని అనుసరిస్తూ ప్రయాణం సాగిం చాలి. ఎనిమిది నెలల పాటు తరిణిలోనే మా నివాసం కాబట్టి పుస్తకాలు తెచ్చుకున్నా. కుటుంబ సభ్యులు, ఫ్రెండ్స్ ఇచ్చిన గిఫ్ట్స్, సంగీత వాద్య పరికరాలతోపాటు అమ్మ చేసిన ఊరగాయలు, కాలికట్ చిప్స్, టాపియోకా చిప్స్ తీసుకెళ్తున్నా. ఈ ప్రయాణం మొత్తానికి సరిపడా దోశల పిండి కూడా మా వెంట తీసుకువెళుతున్నాం. డిఫెన్స్ ఫుడ్ రీసెర్చ్ లేబొరేటరీ రూపొందించిన ప్రత్యేక మైన ఆహారాన్ని మాకు అందుబాటులో ఉంచా రు' అని తెలిపింది లెఫ్టినెంట్ కమాండర్ దిల్నా.

వీరి యాత్ర సఫలం కావాలని కోరుకుందాం.

– కరుకోల గోపీకిశోర్ రాజా, సాక్షి, విశాఖపట్నం

లీగల్

ఆ రియల్ ఎస్టేట్ సంస్థపై కేసు పెట్టచ్చు

ప్రశ్న: మేము లోన్ ద్వారా ఒక రియల్ ఎస్టేట్ సంస్థ వద్దనుంచి నిర్మాణదశలోనే ఫ్లాట్ కొన్నాము. ఒప్పందం ప్రకారం పది నెలల లోగా ఫ్లాటు మాకు పూర్తి చేసి ఇవ్వాలి. కానీ సంవత్సరం అయినా ఇంకా పూర్తి చేయలేదు. లోను నెలవారీ వాయిదాలు కట్టడం కూడా మొదలైంది. ఈ పరిస్థితుల్లో మేము ఏం చేయాలి? పరిష్కారం చెప్పగలరు.

– టి.ఆర్. రాజేశ్వరి, హైదరాబాద్

సర్వసాధారణంగా రియల్ ఎస్టేట్ సంస్థ వారు, మీరు రాసుకునే ఒప్పంద పత్రం అంటే అగ్రిమెంట్‌లో సమయానికి ఫ్లాట్ నిర్మాణం పూర్తి చేసి, మీకు అందజేయకపోతే అందుకుగాను తాత్కాలిక పరిహారం/ఉపశ మనం ఏం చేస్తారో రాసుకుంటారు. కొన్ని సందర్భాలలో ఫ్లాట్ అప్పగించేంతవరకు అద్దె ఇవ్వటం లేదా మీ తరఫున నెలవారీ లోను డబ్బులు సదరు కంపెనీ వారే కట్టేలా ఒప్పందాలు కూడా రాసుకుంటారు. మీ ఒప్పందపత్రంలో కూడా అటువంటి కండి షన్ ఏమైనా ఉందేమో చూసుకోండి. ఏది ఏమైనా ఒప్పందాన్ని ఉల్లంఘిస్తే, మీరు సదరు రియల్ ఎస్టేట్ సంస్థపై వినియోగదా రుల రక్షణ చట్టం కింద కేసు వేయవచ్చు. మీకు జరిగిన ప్రతి నష్టాన్ని లెక్కగట్టి దానికి తోడు మీకు కలిగిన మానసిక క్షోభకి కూడా అదనంగా పరిహారం కోరవచ్చు, పొంద వచ్చు. అదనంగా... ఒకవేళ మీరు కొన్న ఫ్లాట్ ప్రాజెక్టు రెరా (రియల్ ఎస్టేట్ రెగ్యులే టరీ అథారిటీ) లో రిజిస్టర్ అయి ఉంటే అద నంగా రెరాకు కూడా ఫిర్యాదు చేయవచ్చు. మీ అగ్రిమెంటు, ఆస్తి కొనుగోలు పత్రాలు తీసుకొని దగ్గర్లోని లాయర్‌ని కలవండి.

మొదటగా ఒక నోటీసు పంపి, అప్పటికీ కూడా మీకు పరిష్కారం దొరకకపోతే, పైన తెలిపిన విధంగా దావా వేసి న్యాయం పొంద వచ్చు. వినియోగదారుల చట్టం ప్రకారం మీ కేసు మీరు కూడా వాదించుకోవచ్చు లేదా మీ తరఫున మరెవరినైనా 'ఆథరైజ్డ్ పర్సన్'గా నియమించుకోవచ్చు. 50 లక్షల దావా వరకు జిల్లా వినియోగదారుల ఫోరంలో, 50 లక్షల నుంచి రెండు కోట్ల వరకు రాష్ట్ర ఫోరంలో అలాగే రెండు కోట్ల పైన విలువ గల దావాకి జాతీయ విని యోగదారుల ఫోరంలో మీ ఫిర్యా దును నమోదు చేయాల్సి ఉంటుంది.



– శ్రీకాంత్ చింతల
హైకోర్టు న్యాయవాది

మీకున్న న్యాయపరమైన సమస్యలు, సందేహాలకోసం sakshifamily3@gmail.com కు మెయిల్ చేయవచ్చు.





దేవుడు తన రెండు కాళ్లనూ బలహీనపరిచినా.. అవరోధాలనే అవకాశాలుగా మలుచుకుని తన జీవితాన్ని తానే నిలబెట్టుకున్నారామె. ఇప్పుడు తన లాంటి దివ్యాంగుల ఉద్ధరణకు నడుం బిగించి వారికీ బతుకుబాట చూపుతున్నారు.
ఆమే డీ హబ్ వ్యవస్థాపకురాలు కొప్పుల వసుంధర. ఉన్న చోటే వారు వ్యాపారం చేసుకునేలా అవగాహన కల్పిస్తూ రిజిస్ట్రేషన్, పెట్టుబడి, మార్కెటింగ్ వంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు.
ఆమె ఇంటర్వ్యూని ఈ లింక్‌ను క్లిక్ చేసి సాక్షి @ నవశక్తిలో చూసేద్దాం.
https://www.youtube.com/watch?v=0c7--NycLyU



"ఇది నవరాత్రుల పవిత్ర సమయం. ప్రజలు దుర్గాదేవి పట్ల భక్తితో వివిధ మార్గాల్లో కలిసి మెలిసి పూజలు జరుపుకుంటున్నారు. ఈ సంతోషంతో ఆమె దయకు పరవశుడనై రాసిన 'ఆవతికలాయ్' అనే గర్బా గేయాన్ని ఇక్కడ ఉంచాను. ఆమె ఆశీస్సులు మనపై ఎప్పుడూ ఉండాలి" అంటూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. గాయని పూర్వామంత్రి పాడిన ఈ గేయం గర్బా నృత్యానికి ఉన్న ప్రాధాన్యత తెలుసుకునేలా చేయడంతో పాటు ప్రతి మదిని ఆధ్యాత్మిక సౌరభమై తాకుతోంది. సోషల్ మీడియా వేదికగా వైరల్ అవుతోంది.

● భక్తి

ఆటా పాటగ మారిన స్త్రీశక్తి


గర్బా నృత్యం

గర్బా నృత్యం అనగానే సంప్రదాయదుస్తులు ధరించిన సమూహాలు, ఆనందంగా నృత్యం చేస్తున్న దృశ్యాలు మన కళ్లముందు మెదలు తాయి. ఆధ్యాత్మిక బలానికి మానసికోల్లా సాన్ని కలిపి జరుపుకునే ఈ వేడుక మొదట గుజరాతీ గ్రామాలలో పుట్టి, దేశ ఎల్లలు దాటి నేడు ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటున్నారు.

చిల్లులు గల మట్టి కుండలో దీపం వెలి గించి, తలపైన పెట్టుకుని అమ్మవారి విగ్రహం చుట్టూ వలయాకారంగా తిరుగుతూ భక్తి పార వశ్యంలో నృత్యం చేస్తారు. మట్టికుండ తల్లి గర్భాన్ని, జ్యోతి నుండి వెలువడే కాంతి లోపల పెరుగుతున్న కొత్త జీవిని సూచిస్తుంది. భక్తుల కోసం రాక్షసుడితో పోరాడిన దేవత పట్ల తమ ప్రేమ, కృతజ్ఞతలను ఈ నృత్యం ద్వారా తెలి యజేస్తారు. మనలో ఉన్న అన్ని చెడులను నాశనం చేయడానికి, లోపల ఉన్న శక్తిని మేల్కొలిపే విధానంగా కూడా గర్బా నృత్యాన్ని చెబుతారు. గర్బా నృత్య రూపం స్త్రీత్వం, సంతానోత్పత్తిని తెలియజేస్తుంది. ఇందులో భజనలు, కీర్తనలకు చోటు ఎక్కువ. ఎక్కువ భక్తి ఆకర్షణను కలిగి ఉండే గర్బాను అమ్మవారి హారతికి ముందు నిర్వహిస్తారు.

కాలచక్రం .. పునరావృతం

దేవీ ఆరాధనలో భాగంగా చెప్పుకునే ఈ నృత్యాన్ని స్త్రీ–పురుషులు ఇద్దరూ తొమ్మిది రాత్రులు చేస్తారు. చాలా మంది ఈ తొమ్మిది రోజులూ కొన్ని ప్రత్యేక ఆహార నియమాలు, ఉపవాసాలు పాటిస్తారు. కాలచక్రం ఎప్పుడూ తిరుగుతూ పునరావృతం అవుతుంది. పుట్టుక నుంచి మరణం వరకు, మరణం నుంచి పున ర్జన్మ వరకు ఆత్మ తిరుగుతూ ఉంటుంది. ఈ అన్ని అంశాల్లోనూ కదలకుండా నిరంతరా యంగా ఉండేది దైవశక్తి ఒకటే. దానికి ప్రతీ కగా నృత్య వలయం మధ్య దేవీ ప్రతిమ లేదా పెద్ద దీపపు సెమ్మెను పెడతారు. జీవన చక్రం దాని చుట్టూనే పరిభ్రమిస్తుంటుందని చెప్పేం దుకు ఇదొక ప్రతీక.

మహిషుని అంతం చేసిన మహిళా శక్తి

ఒక్క స్త్రీ చేతిలో తప్ప మరెవరి చేతిలోనూ మరణించకుండా ఉండాలన్న వరబలంతో మహిషాసురుడు తన శక్తులను చెడు కోసం ఉపయోగించడం ప్రారంభించాడు. అతడి దాడికి దేవతలు నిస్సహాయలైపోయారు. దుర్గాదేవి వద్దకు వెళ్లి, వేడుకున్నారు. దుర్గా దేవి ఒక్క కంటిచూపుతో ఆ రాక్షసుని అంతం చేయగలదు. కానీ, అసుర సంహారానికి ముందు తొమ్మిది పగళ్లు, తొమ్మిది రాత్రుల పాటు సాగిన సర్వోన్నతమైన యుద్ధం ద్వారా మానవాళికి గొప్ప సందేశాన్ని ఇచ్చింది. అసాంఘిక, అధార్మిక శక్తులు ఎంత బలంగా కనిపించినా, యుద్ధం ఎంతకాలం సాగినా, చివరికి ధర్మమే విజయం సాధిస్తుందని ఈ కథ ద్వారా మనకు తెలుస్తుంది. ఈ కథనాన్ని గర్బా నృత్యం ద్వారా ప్రదర్శించడం అంతర్లీ నంగా కనిపిస్తుంది.

బేతే గర్బా

గుజరాత్‌లోని నాగర్ కమ్యూనిటీ 'బేతే గర్బా' అంటే కూర్చున్న గర్బా అని జరుపుకుం టారు. ఇక్కడ, భక్తులు ఒకరి ఇంటి వద్ద గుమి గూడి, గర్బా పాటలు పాడతారు. హిందువులు తమ పండుగలను బహిరంగంగా జరుపుకోవ డాన్ని నిజాం నిషేధించినప్పుడు, ఇస్లామిక్ పాలనలో జునాగఢ్ లో బేతే గర్బా ప్రారంభ మైంది. చాలామంది కఠినమైన ఉపవాస దీక్షలో ఉన్నప్పటికీ నృత్యం, సంగీతంతో ఉల్లా సంగా మారిపోతారు. ఉత్తర భారతదేశంలో గర్బా లో భక్తులు తబలా, మంజీరను ఉపయో గిస్తారు.

సంప్రదాయ దుస్తులతో...

ఈ నృత్యంలో మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి, శక్తి దేవత ఆశీర్వాదాలు కోరుకుంటూ నృత్యం చేస్తారు. గర్బా, దాండియా ఒకే విధంగా కనిపించినా, ఈ రెండింటికి వ్యత్యాసం ఉంది. గర్బాలో చేతులు, కాళ్లను సమన్వయంతో కదిలిస్తూ చేస్తారు. దాండియాలో కోలాటం కర్రలను ఉప యోగిస్తారు. గర్బా పాటలు దుర్గాదేవి, ఆమె అవతారాల చుట్టూ ఉంటే, దాండియాలో పాటలు కృష్ణుడి రాసలీలలపై ఉంటాయి.

పాదరక్షలు లేకుండా..

గర్బా దైవారాధనా రీతుల్లో చెప్పులు ధరించకపోవడం సకల జీవులకు ఆలవాల మైన భూదేవి పట్ల మనం చూపే గౌరవంగా భావిస్తారు. భూమిని నిరంతరం అంటి పెట్టు కుని ఉండే ఈ పాదాల ద్వారానే శరీరంలోకి శక్తి ప్రవాహం జరుగుతుందని నమ్మకం. ఆ దేవితో మనకు నేరుగా సంబంధాన్ని కల్పిం చేవి పాదాలే. అందుకే చెప్పులు లేకుండా చేసే ఈ నృత్యం పవిత్రమైన దైవారాధన వంటిది.

గర్బా.. యునెస్కో

నవరాత్రి ఉత్సవాలను గుజరాత్‌తో పాటు దేశంలోని అనేక ప్రాంతాలలో నిర్వహి స్తుంటారు. మన దేశానికే ప్రత్యేకమైన ఈ ప్రముఖ నృత్యాన్ని యునెస్కో 'ఇంటాంజి బుల్ కల్చరల్ హెరిటేజ్ ఆఫ్ హ్యూమానిటీ' (ఐసీహెచ్) జాబితాలో కిందటేడాది చేర్చింది. అమ్మవారి ఎదుట భక్తిని నృత్య రూపంలో చాటే ఈ ప్రాచీన సంప్రదాయం ఇప్పటికీ ఎప్పటికీ సజీవమే అనడానికి ప్రతీక గా నిలుస్తోంది గర్బా.

టెక్నాలజీ

స్వాగతం.. సుస్వాగతం



బెంగళూరులోని ఒక హోటల్‌లోకి అడుగు పెట్టిన అనన్య నారంగ్‌కు రిసెప్షనిస్ట్ స్వాగతం పలికింది.

అనన్యలో షాక్‌లాంటి ఆశ్చర్యం.

'ఇందులో ఆశ్చర్యపోవాల్సింది ఏముంది!' అనే కదా మీ డౌటు.

అయితే సదరు ఈ రిసెప్షనిస్ట్ సాధారణ రిసెప్షనిస్ట్ కాదు... వర్చువల్ రిసెప్షనిస్ట్!

'సిలికాన్ వ్యాలీ ఆఫ్ ఇండియా బెంగళూ రులో వర్చువల్ రిసెప్షనిస్ట్' వార్త సోషల్ మీడి యాలో చక్కర్లు కొడుతోంది. మన దేశంలో నవీన సాంకేతికత గురించి వివరంగా మాట్లాడు కునేలా చేస్తోంది.

'సాంకేతికత సహాయంతో తక్కువ సిబ్బం దితో ఎక్కువ పనులను ఏకకాలంలో సమ న్వయం చేస్తున్నారు. సిలికాన్ వ్యాలీలో తప్ప మన దేశంలో ఎక్కడా ఇలాంటి దృశ్యం కనిపిం చదు' అంటూ ఈ 'వర్చువల్ రిసెప్షనిస్ట్' ఫొటోని షేర్ చేసింది అనన్య.

'ఎంత సాంకేతిక ప్రగతి' అనే ప్రశంసల మాట ఎలా ఉన్నా... 'అబ్బబ్బే! ఇదేం ప్రగతి. అందమైన మానవ రిసెప్షనిస్ట్ స్వాగతం పలకడా నికి, వర్చువల్ రిసెప్షనిస్ట్ స్వాగతం పలకడానికి చా...లా తేడా ఉంటుంది' అనే వాళ్లే ఎక్కువ!

● చిన్నారులపై జచింత

నెత్తుటేరుల అవార్డ్ నాకొద్దు


జసింతా కెర్కెట్టా

తన ఆదివాసీల సామాజిక, సాంస్కృతిక జీవితం గురించి లోతుగా రాయడమే కాదు పిల్లల ప్రపంచం గురించి కూడా రాస్తోంది కవయిత్రి జసింతా కెర్కెట్టా.

ఎక్కడ చూస్తే అక్కడ వార్తై – విశ్వరూపమున విహరి స్తున్న ఈ కాలంలో పిల్లల కోసం జసింత రాసిన 'జిర్హుల్' అనే పుస్తకానికి 'రూమ్ టు రీడ్ యంగ్ రైటర్–2024' అవార్డ్ ప్రకటించారు. పాలస్తీనాలో బాంబు దాడుల్లో మరణించిన, హింసకు గురవుతున్న పిల్లలను దృష్టిలో పెట్టుకొని ఈ అవా ర్డ్‌ను జసింత తిరస్కరించింది.

'రూమ్ టు రీడ్ ఇండియా' అనేది అక్షరాస్యత, లింగ సమానత్వం... మొదలైన వాటిపై పనిచేసే స్వచ్ఛంద సంస్థ. ఈ సంస్థకు ఏరోస్పేస్ దిగ్గజం 'బోయింగ్'తో సంబంధం ఉంది అని ఆరోపిస్తూ తనకు ప్రకటించిన అవార్డ్‌ను జసింత కెర్కెట్టా తిరస్కరించింది. 'బోయింగ్‌కు ఇజ్రాయెల్ సైన్యంతో 75 ఏళ్లుగా సంబంధం ఉంది. ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడీఎఫ్)కు ఆయుధాలను సరాఫరా చేసే కీలక సంస్థ అయిన బోయింగ్ 'రూమ్ టు రీడ్ ఇండియా ట్రస్ట్'కు నిధులు అంద జేస్తుంది' అని జసింత తన తిరస్కరణ కారణాలపై ఆ ట్రస్ట్‌కు లేఖ రాసింది.

'ఆయుధాలతో పిల్లల ప్రపంచం నాశనం అవుతున్న ప్పుడు ఆయుధాల వ్యాపారం, పిల్లల సంరక్షణ ఏకకాలంలో ఎలా కొనసాగుతాయి?' అని ఆ లేఖలో ప్రశ్నించింది జసింత.

'సాహిత్యంలో వైవిధ్యమైన, పిల్లల కోసం రాస్తే

పిల్లల్లో సామాజిక చైతన్యం

'పిల్లలూ... మీరు ఎన్ని పువ్వుల గురించి విన్నారు? పూల న్నింటి గురించి తెలియనప్పుడు, కొన్ని పువ్వుల గురించి మాత్రమే తెలిసినప్పుడు... అవి మాత్రమే గొప్ప పుష్పాలూ, ప్రత్యేకమైన పుష్పాలూ ఎలా అవుతాయి? ఇవి మాత్రమే కాదు జిరాహుల్, జతంగి, సొనార్హి, సరాయ్, కోయినార్, సనాయ్ లాంటి ఎన్నో పూలు ఉన్నాయి' అంటూ పది పువ్వుల గురించి జసింత కవిత్వం రాసింది. ఈ పువ్వుల గురించి ఎప్పుడూ వినని, ఎప్పుడూ చూడని పిల్లలు కూడా జసింత రాసిన కవిత్వం చదివి, పక్కన ఉన్న బొమ్మలు చూస్తే ఎక్కడ ఏ పువ్వు కనిపించినా ఇట్టే గుర్తు పట్టేస్తారు.

ఈశ్వర్ ఔర్ బజార్, జసింతా కీ డైరీ, ల్యాండ్ ఆఫ్ ది రూట్స్‌తో సహా ఏడు పుస్తకాలు రాసింది.

'జిర్హుల్'లో పువ్వుల ప్రపంచం కనిపించినప్పటికీ అది అణగారిన వర్గాల కోసం ప్రతీకాత్మకంగా రాసిన పుస్తకం. ఆదివాసీ సంస్కృతి ఆధారంగా చేసుకొని పిల్లల్లో సామాజిక, రాజకీయ చైతన్యాన్ని పెంపొందించ డమే ఈ పుస్తక లక్ష్యం. గాజాలో పదహారువేల మందికి పైగా చిన్నారులు మరణించారు. నెత్తుటేరులు పారాయి. ఈ నేపథ్యంలో 'రూమ్ టు రీడ్ యంగ్ రైటర్' అవార్డ్‌ను జసింత తిరస్కరించింది.



పుస్తకాలు తక్కువగా వస్తున్నాయి. బాల సాహిత్యానికి సంబంధించిన జిర్హుల్ పుస్త కానికి అవార్డ్ రావడం సరియైనదే అయినా ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ఈ అవార్డ్‌ను స్వీకరించలేను' అని చెప్పింది.

ఈ తిరస్కరణ మాట ఎలా ఉన్నా 'సాహిత్యానికి జసింత కెర్కెట్టా చేసిన కృషి విలువైనదిగా భావిస్తున్నాం' అని స్పందించింది 'రూమ్ టు రీడ్ ఇండియా' ట్రస్ట్. ఇప్పుడు మాత్రమే కాదు సామా జిక కారణాలతో తనకు వచ్చిన కొన్ని అవార్డ్‌లను గతంలోనూ తిరస్కరించింది జసింత.

ఉద్యమ నేపథ్యం...

ఝార్ఖండ్‌లోని ఖుదపోష్ గ్రామంలో ఆది వాసీ కుటుంబంలో పుట్టిన జసింత మాస్ కమ్యూ నికేషన్, వీడియో ప్రొడక్షన్‌లో డిగ్రీ చేసింది. రాంచీలోని ఒక ప్రముఖ దినపత్రికలో పని చేసింది. కెరీర్ పరంగా ఎంత ముందుకు వెళ్లినా తన మూలాలను మాత్రం మరవలేదు. 'ఆదివాసీ అండ్ మైనింగ్ ఇన్ ఫైవ్ డిస్ట్రిక్ట్స్ ఆఫ్ ఝార్ఖండ్' పేరుతో అధ్యయన పత్రాన్ని వెలువరించింది.

'ఇండిజినస్ వాయిస్ ఆఫ్ ఆసియా' అనే పరి శోధన పత్రానికి ఇండిజినస్ పీపుల్స్ ప్యాక్ట్ అవార్డు లభించింది. జర్నలిస్ట్‌గానే కాదు కవిత్వా నికి సంబంధించి సృజనాత్మక రచనలతోనూ ఎన్నో అవార్డ్‌లు అందుకుంది. తన కవిత్వం విషయానికి వస్తే అది ఆకాశపల్లకిలో ఊరేగదు. జ్ఞాపకాలను నెమరు వేసుకునేలా ఉంటుంది. గాయాలను గుర్తు తెచ్చుకునేలా ఉంటుంది. బూటకపు అభివృ ద్ధిని ప్రశ్నించేలా ఉంటుంది.

జసింత మనోహర్‌పూర్‌లోని మిషనరీ బోర్డింగ్ స్కూల్‌లో చదువుతున్న రోజుల్లో తల్లి పుష్ప అనిమ తండ్రి చేతిలో తరచు హింసకు గురయ్యేది. మరచిపోలేని ఆ హింసాత్మక దృశ్యాలు తన కవిత్వంలో కనిపిస్తాయి. వ్యక్తిగత చేదు అనుభవాలే కాదు అభివృద్ధి పేరుతో ఆదివాసీ గ్రామాల్లో జరుగుతున్న విధ్వంసం కూడా జసింత కవిత్వంలో కనిపిస్తుంది.

జసింత కెర్కెట్టా జర్నలిస్ట్ మాత్రమే కాదు సోషల్ యాక్టివిస్ట్ కూడా. బాలికల విద్యకు సంబంధించి ఎన్నో ఆది వాసీ గ్రామాల్లో పనిచేసింది. ఫోర్బ్స్ ఇండియా 'టాప్ 20 సెల్ఫ్‌మేడ్ ఉమెన్'లో ఒకరిగా ఎంపిక అయింది.